క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు పెద్దబండ, ఇండోర్ స్టేడియం, గొల్లగూడ, మహిళా ప్రాంగణం, బృందావన్ హోమ్స్, అల్కాపురి కాలనీ, హైటెక్ కాలనీ, శబరి హోమ్స్, బీటీఎస్, కలెక్టరేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సమావేశం

నల్లగొండ టూటౌన్: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లి సమీపంలో గల విపస్యా స్కూల్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరుగనున్న ఈ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని ఆయన తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

కనగల్: మండల పరిధిలోని ఎం గౌరారం గ్రామానికి చెందిన బొమ్మపాల రిత్విక్, మండలి కోటేష్, జంపారాతి అంజయ్య, కనగల్ ఎక్స్ రోడ్డుకు చెందిన నీలకంఠం రాములు ఇటీవల మృతిచెందారు. మృతుల కుటుంబ సభ్యులకు ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ శనివారం రూ.10,000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఎంపీటీసీ యేరేడ్ల సరస్వతీసుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు గోన శంకర్‌రావు, ఉప సర్పంచ్ రాయల పెద్దులు, బీఆర్‌ఎస్ మండల ప్రచార కార్యదర్శి మండలి పరమేష్ తదితరులు ఉన్నారు.

నల్లగొండరూరల్: మండలంలోని మేళ్లదుప్పలపల్లి గ్రామానికి చెందిన నందిపాటి ప్రదీప్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని శనివారం పిల్లి రామరాజు యాదవ్ పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా నర్సింగ్‌బట్లలో వల్లకీర్తి కొండయ్య కుటుంబానికి, దోనకల్‌లో సల్లోజు సత్తమ్మ కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

'ఇంపాక్ట్' ఆధ్వర్యంలో ట్రైన్ ద ట్రైనర్ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ట్రైనర్లు

నల్లగొండ రూరల్: ట్రైన్ ద ట్రైనర్ వర్క్‌షాప్(టీటీటీడబ్ల్యూఎస్) 115వ బ్యాచ్‌కు శనివారం నల్లగొండలోని ఓ హోటల్‌లో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఫౌండర్ గంపా నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు భవిష్యత్‌లో ఎలాంటి పరిస్థితులనైనా అధిగమించేలా అవగాహన కల్పించేందుకు గాను ట్రైనర్లకు వర్క్‌షాప్ నిర్వహించినట్లు స్ఫూర్తి ఇన్‌చార్జి శ్యాం రాథోడ్, రవీంద్రదీర, 115వ బ్యాచ్ ఇన్‌చార్జి నూనె సుదర్శన్ తెలిపారు. కార్యక్రమంలో 40 మంది ట్రైనర్లు, మెంటార్లు గీతారాణి, సరిత, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కోమటిరెడ్డి పరామర్శ



నల్లగొండ: అమీర్‌ను పరామర్శిస్తున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: పట్టణంలోని 45వ వార్డు కౌన్సిలర్ అమీర్ తల్లి ఆఫిఫా సుల్తానియా ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం అమీర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమీర్ కుటుంబానికి అండగా ఉంటానని ఎంపీ హామీ ఇచ్చారు.

కనగల్‌లో..

కనగల్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నీలకంఠం రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. రాములు కుటుంబ సభ్యులను శనివారం భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరామర్శించారు. రాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, పగిడిపాటి సత్తయ్య, కూసుకుంట్ల రాజారెడ్డి, వంపు ప్రేమయ్య, మాచర్ల రాములు తదితరులు ఉన్నారు.

గొర్రెల యూనిట్ల పంపిణీ

మునుగోడు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ గొర్రెల యూనిట్లను శనివారం మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు ఎంపీపీ కర్నాటి స్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శైలజ, ఈద శరత్‌బాబు, బీఆర్‌ఎస్ నాయకులు దోకూరి వేణుగోపాలరెడ్డి, బోయపర్తి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

హరిత తెలంగాణను సృష్టించాలి



చిట్యాల: మొక్క నాటుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి తదితరులు



నల్లగొండ రూరల్: ఎంజీయూలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు



కట్టంగూర్: అయిటిపాములలో మొక్క నాటుతున్న అదనపు డీఆర్‌డీఓ శైలజ



రామగిరి: మొక్క నాటుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ కాంతమ్మ, ఎంపీపీ తదితరులు



మునుగోడు ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



చండూరు: మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ తదితరులు

చిట్యాల: ప్రతి పౌరుడు మొక్కలు నాటి హరిత తెలంగాణను సృష్టించాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లిలో నిర్వహించిన కోటి వృక్షార్చన కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో కూడా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలను సునీతవెంకటేష్, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మయాదగిరిగౌడ్, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కల్లూరి లింగస్వామి, ఎంపీడీఓ లాజర్, ఎంపీఓ పద్మ, కమిషనర్ ఎం. రామదుర్గారెడ్డి, సర్పంచ్ రత్నం పుష్పమ్మనర్సింహ, ఎంపీటీసీ దుబ్బ పద్మకుమారస్వామి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సంరక్షణకు హరితహారం పునాది

ఎంజీయూ(నల్లగొండ రూరల్): ప్రకృతి సంరక్షణకు హరితహారం పునాదిలాంటిదని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఓఎస్‌డీ, అధ్యాపకుడు అల్వాల రవి అన్నారు. స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపులో భాగంగా శనివారం ఎంజీయూలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి, హాస్టల్ డైరెక్టర్ ప్రేమ్‌సాగర్, అధ్యాపకులు ప్రశాంతి, సైదులు, రామచంద్రుడు, నాగరాజు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో..

నాంపల్లి: స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా చేపట్టిన కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా నాంపల్లి మండలంలోని స్వాముల వారిలింగోటం గ్రామంలో ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేతారవీందర్‌రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషుకుమార్, ఎంపీటీసీ బెక్కం రమేష్, సర్పంచ్ పాండు, ఉప సర్పంచ్ ఆవుల వెంకటయ్య, వార్డు సభ్యులు గడ్డి పుల్లయ్య, గుండు రఘుపతి, అన్నేపాక ఈదయ్య, గడ్డి అంజయ్య, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ: కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా మర్రిగూడ మండలంలోని రాజాపేటతండాలో శనివారం మండల స్పెషల్ ఆఫీసర్ ఏడీఏ ఎల్లయ్య మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ స్పెషల్ ఆఫీసర్ రవీందర్, సర్పంచ్ నూనావత్ సక్కుబాయిబిచ్చానాయక్, సూపరింటెండెంట్ యాకుబ్, ఈసీ వివేక్, టీఏ సత్యనారాయణ ఉన్నారు.

చండూరులో..

చండూరు: చండూరు మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తోకల వెంకన్న, కోడి వెంకన్న, యాదయ్య, కమిషనర్ మొజాయిద్దీన్, మేనేజర్ ప్రభాకర్ తదిదరులు ఉన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్: నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని అదనపు డీఆర్‌డీఓ జేబీ శైలజ అన్నారు. కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఆమె మొక్కను నాటారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, ఎంపీటీసీ బెల్లి మహాలక్ష్మిసుధాకర్, వీరమ్మసైదులు, ఎంపీడీఓ సునీత, ఎంపీఓ పర్వేజ్, ఎఫ్‌బీఓ రజిత, ఏఓ శ్రీనివాస్, ఏపీఎం వినోద, ఏపీఓ రాంమోహన్ పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

మునుగోడులో..

మునుగోడు: స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం మునుగోడు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణతో పాటు పీహెచ్‌సీలో ఎంపీపీ కర్నాటి స్వామి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భ్యాకర్‌గౌడ్, ఎంపీఓ సుమలత, ఫారెస్ట్ అధికారి శ్రీనివాస్, ఏపీఓ శ్రీనయ్య, పంచాయతీ కార్యదర్శి మురళీక్రిష్ణ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జెడ్పీ డిప్యూటీ సీఈఓ

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ కాంతమ్మ, ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మిలింగారావుతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, సర్పంచ్ రొట్టెల రమేష్, ఎంపీఓ నరసింహస్వామి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: మండలంలోని ఆకారం గ్రామంలో స్థానిక సర్పంచ్ కందాల సమరంరెడ్డితో కలిసి గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న మొక్కలు నాటారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు బస్వరాజు, శంకరయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చెన్నారం గ్రామంలో..

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలంలోని చెన్నారం గ్రామంలో సర్పంచ్ ఉప్పునూతల వెంకన్న యాదవ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరితయాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ సునీత, రాములు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యం



బోడంగిపర్తిలో విద్యార్థులతో కరచాలనం చేస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

చండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం ఆయన చండూరు మండలంలోని బోడంగిపర్తి, శిర్దేపల్లి, పడమటితాళ్ల, ఉడతలపల్లి గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలకు సరైన రోడ్లు లేవని, అధికార పార్టీ ఎమ్మెల్యే గ్రామీణ ప్రాంతాలకు చేసిందేమీ లేదని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. రేషన్ దుకాణాల్లో 9 రకాల సరుకులను చౌక ధరలకు అందజేస్తామన్నారు. పేదలు ఇళ్ల నిర్మించుకునేందుకు రూ.5లక్షల చొప్పున అందజేస్తామన్నారు. పడమటితాళ్ల గ్రామంలో యువకులు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోడిగిరి బాబు, వంగూరి యాదయ్య, పాలకూరి నాగరాజు, విష్ణు నరసింహ, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, సమీర్, ఖలీల్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చండూరు(గట్టుప్పల్): గట్టుప్పల మండల కేంద్రానికి చెందిన చెరిపల్లి అమూల్య, ఇడం లక్ష్మయ్యకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం రాష్ట్ర గీతకార్మికుల ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ పల్లె రవికుమార్ అందజేశారు. కార్యక్రమంలో గట్టుప్పల మండల బీఆర్‌ఎస్ పార్టీ కన్వీనర్ ఇడం కైలాసం, సర్పంచ్ ఇడెం రోజా, భీమగాని యాదయ్య, మాదగాని వెంకటేష్‌గౌడ్, రమేష్‌నేత తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకోరులపై చర్యలు తీసుకోవాలని వినతి

మునుగోడు: ప్రభుత్వ భూమిలోని రోడ్డుని కబ్జాచేసి ప్రహరీ నిర్మించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మునుగోడు మండలంలోని సింగారం గ్రామానికి చెందిన నకరకంటి రాజు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి శనివారం వినతి పత్రం అందజేశాడు. సింగారం గ్రామంలోని తూర్పుకాలనీ నుంచి పెద్దబండ మీదకు రైతులు, గ్రామ ప్రజలు నిత్యం రాకపోకలు జరిపే రోడ్డుని అదే గ్రామానికి చెందిన వ్యక్తి కబ్జా చేయడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వినతిపత్రంలో పేర్కొన్నాడు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

శాలిగౌరారం: మండలంలోని గురుజాల గ్రామంలో లయన్స్‌క్లబ్ శాలిగౌరారం ఆధ్వర్యంలో శనివారం వంద మందికి బీపీ, షుగర్(మధుమేహం) పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో బకెట్లు, గర్భిణులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ శాలిగౌరారం అధ్యక్షుడు మారం వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దునుక వెంకన్న, గ్రామ సర్పంచ్ గుండా శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కనగల్: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నల్లగొండ ఆర్డీఓ ఎస్. రవి అన్నారు. ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం కనగల్ మండలంలోని పర్వతగిరి, బొమ్మేపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి. జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ తబిత, ఆర్ఐ మర్రి యాదగిరి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రణాళిక ఉంటే పనిఒత్తిడి ఉండదు

ఎంజీయూ(నల్లగొండ రూరల్): ప్రణాళిక ఉంటే పని ఒత్తిడిని అధిగమించవచ్చని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఎండీ అలీముద్దీన్ అన్నారు. శనివారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో పని ప్రదేశాల్లో సమయపాలన, పని ఒత్తిడి అనే అంశంపై ఎస్‌బీఐ సిబ్బంది, విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాంకేతికతను ఉపయోగిస్తే ఒత్తిడిని జయించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు శ్రీలక్ష్మి, రవి, ఫణికుమార్, ఎంవీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కొనసాగిస్తాం

నల్లగొండ టౌన్: రెండవ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసేంత వరకు సమ్మె కొనసాగిస్తామని ఏఐటీయూసీ రెండవ ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు రత్నకుమారి అన్నారు. కలెక్టరేట్ వద్ద రెండవ ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మెలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సయీద్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి పాండురంగారావు, వి. లెనిన్, ఏఎన్‌ఎంల సంఘం కార్యదర్శి నర్సమ్మ, నాగమణి, వసంత, సులోచన, హరిత, సుశీల, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్లు అందజేయాలి

నల్లగొండ టౌన్: అసెంబ్లీలో ప్రకటించిన విధంగా భవన నిర్మాణ కార్మికులకు మోటారు సైకిళ్లను అందజేయాలని తెలగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సోమవారం జిల్లా లేబర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అద్దంకి నర్సింహ, బోడ ఇస్తారి, ఎండీ సుల్తాన్, సీత వెంకటయ్య, మీసాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

చండూరు(గట్టుప్పల్): గట్టుప్పల మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలను శనివారం వెల్మకన్నె జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను వెల్మకన్నె జెడ్పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జి హెచ్‌ఎం అద్దంకి దేవదాస్, వెల్మకన్నె సర్పంచ్ చల్లమల్ల వెంకటరెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరామ్, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు, పీఈటీ రవీందర్‌రెడ్డి, అంజయ్య ప్రారంభించారు. అండర్-14 ఖోఖో బాలికల విభాగంలో నీల వైష్ణవి, మద్ది అంజలి, దుంప వర్షిత, బాలుర విభాగంలో ఎం. చరణ్, యస్. అభినవ్, అండర్-14 కబడ్డీ బాలుర భాగంలో కే. ప్రశాంత్, పి. అరవింద్, బి. భరత్, బి .శివతేజ, బాలికల విభాగంలో ఎర్ర రక్షణ, ఎర్ర అక్షర ఎంపికయ్యారు.

గద్దర్‌కు నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నాంపల్లి: మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం గద్దర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ అమర వీరుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోరే సాయిరాం, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బుడిగపాక జగన్, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగన్న, డోల్ దెబ్బ గొల్ల కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మలిగె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న గంగాధర్‌రావు

నకిరేకల్: మండలంలోని మంగళపల్లి గ్రామంలో బీజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు పేద కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. షేక్ సయ్యద్, గొడ్డేటి పెదసైదులు, నిమ్మల భిక్షం, బొల్లెద్దు రత్నయ్య, కందికంటి సోమయ్య కుటుంబాలకు రూ.10వేల చొప్పున, రామయ్య, కందికంటి వెంకులు, గురువయ్య, గాదరి సైదమ్మ, దోరేపల్లి క్రిష్ణ, మాచర్ల వెంకన్న కుటుంబాలకు రూ.5వేల చొప్పున అందజేశారు. పేద వృద్ధులకు నిత్యావసర సరుకుల కోసం రూ.8 వేలు అందజేశారు.

మానవ మనుగడకు మొక్కలు నాటాలి



నల్లగొండ టూటౌన్: మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్: మానవ మనుగడకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణాచారితో కలిసి శనివారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమంతో రోడ్ల వెంట ఎక్కడ చూసినా చెట్లే కనిపిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అభిమన్యు శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు కొండూరు సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, సందినేని జనార్దన్ రావు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ప్రారంభం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని తులసీనగర్ శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయం నందు నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని శనివారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం హోమం, పూర్ణాహుతిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కౌన్సిలర్లు మారగోని నవీన్‌గౌడ్, అభిమన్యు శ్రీనివాస్, ఆలయ చైర్మన్ నేలపట్ల రమేష్, ఈఓ కే. కుశలయ్య, కమిటీ సభ్యులు కూరెళ్ల రమణాచారి, రూపేంద్ర గుప్తా, జగదీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే ఆకుపచ్చ తెలంగాణ సాధ్యం



నార్కట్‌పల్లి: లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమం ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని ఆకుపచ్చ తెలంగాణగా మార్చారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం నకిరేకల్ మున్సిపాలిటీ శివారులో ఎస్ఎల్‌బీసీ ప్రధాన కాల్వ వెంట రెండు వేల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. హరితహారం కార్యక్రమం చేపట్టాక తెలంగాణలో అటవీ శాతం బాగా పెరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, నాయకులు కొండ జానయ్యగౌడ్, గర్శకోటి సైదులు, గుర్రం గణేష్, రావిరాల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

నకిరేకల్ మండలం నోముల గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన 50 కుటుంబాలు శనివారం నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో గర్శకోటి శంకర్, పగిళ్ల వెంకన్న, మాచర్ల తిరుమలేష్, సుక్క నాగరాజు, గుండపురి నాగరాజు, పెద్ది లింగయ్య తదితరులు ఉన్నారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి: మండలంలోని కొండపాకగూడెం గ్రామంలోని సంపద వనంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మొక్కలు నాటారు. అనంతరం ప్రముఖ వర్యావరణవేత్త సురేష్ గుప్తా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేప చెట్టుకు రాఖీ కట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి వెంకయ్య, ఎంపీడీఓ గుండగోని యాదగిరి, ఎంపీటీసీలు మేకల రాజిరెడ్డి, పుల్లెంల ముత్తయ్య, సర్పంచ్ కోమనబోయిన మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత..

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామానికి చెందిన రేగట్టె శంకర్‌రెడ్డికి రూ.లక్ష విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీని శనివారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నార్కట్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో చెర్వుగట్టు ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యే చిరుమర్తికి అభినందన..

కేతేపల్లి: నకిరేకల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికైన ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు ఎన్నారై, లండన్ బీఆర్‌ఎస్ సెల్ కార్యదర్శి గొట్టిముక్కల సతీష్‌రెడ్డి అభినందనలు తెలిపారు. శనివారం రాత్రి కేతేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నల్లగొండ టూటౌన్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే విఠల్ సోమన్న అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ వర్క్‌షాప్‌లో భాగంగా శనివారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ పట్టణ పార్టీ పదాధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీని బూత్ స్థాయిలో పటిష్ఠ పర్చాలని, బూత్ స్థాయి కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని సూచించారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల అమలుపై ప్రజల్లో చర్చ జరిగే విధంగా ప్రచారం కల్పించాలన్నారు. గత తొమ్మిదిన్నర ఏళ్లలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసిన దేశాభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, నూకల నరసింహారెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, దాయం భూపాల్ రెడ్డి, దాసోజు యాదగిరాచారి, నాగం వర్షిత్‌రెడ్డి, చింత ముత్యాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నకిరేకల్: పాలాభిషేకం చేస్తున్న గురుకుల అధ్యాపకులు

నకిరేకల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో శనివారం నకిరేకల్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీఎం కేసీఆర్, మంత్రులు హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్ ఫ్లెక్సీకి కాంట్రాక్టు అధ్యాపకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీవీ కృష్ణారెడ్డి, వడ్డెపల్లి ప్రభుదాస్, శశిధర్, మధుకర్, నగేష్, అజిత్, సుగుణ, ప్రవీణ్, విమల తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండలో..

నల్లగొండ: అంగన్‌వాడీ టీచర్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు మజ్జిగపు సునీత మాట్లాడుతూ.. అంగన్‌వాడీల కష్టాన్ని గుర్తించి మూడుసార్లు వేతనం పెంచిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో పుట్ట సునీత, యన్న శశికళ, జ్యోతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



నల్లగొండ: మహాధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు

నల్లగొండ: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను నల్లగొండ పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం. రాజశేఖర్ రెడ్డి, ఎం. సోమయ్య, పి. నాగిరెడ్డి, సైదులు, శౌకత్ అలీ, ఎడ్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

నకిరేకల్: సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ పోరాట సంఘాల సమితి నేతలు పిలుపునిచ్చారు. శనివారం నకిరేకల్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో పలువురు మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సమావేశంలో యాట మధుసూదన్‌రెడ్డి, బి. వెంకటేశం, తాటిపాముల నర్సింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కట్టంగూర్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

కట్టంగూర్: ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి తవిటి వెంకటమ్మ ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం కట్టంగూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ స్వప్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చెవుగోని ధనలక్ష్మి, భూపతి రేణుక, జానకి తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

నాంపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని నాంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంతో పాటు స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట శనివారం ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, ఆశా వర్కర్లు రమావత్ కవిత తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ: మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశా వర్కర్లకు కనీస వేతనం, ప్రమాద బీమా అందించాలన్నారు. కార్యక్రమంలో మట్టం భాగ్యమ్మ, జంపాల వసంత, ఏర్పుల పద్మ, కాలం సుజాత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: ఆశా వర్కర్లకు ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు శనివారం చిట్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహంకాళి పద్మ, గోలి జయసుధ, పత్తి అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐకి వినతి..

నల్లగొండ రూరల్: ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు శనివారం తహసీల్దార్ కార్యాలయ ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్యగౌడ్, మండల కన్వీనర్ సత్యనారాయణ ఉన్నారు.